
# మహానగరం కథలు

## -వేదుల సుభద్ర





# నవ్వులు పంచే పువ్వమ్మ..

*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్థమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

## సింపిల్ స్మైల్స్, ప్లాంట్స్ అండ్ పీజ్జాస్..

అన్న బోర్డ్ అప్పుడేవెలిసిన వర్షం నీళ్ళు పడి మెరుస్తోంది. ఆ బోర్డ్ కింద ఉన్న గేట్ తాళం వేసుకుని ఇంట్లోకి నడిచారు ఇద్దరు మహిళలు. వారిద్దరి వయసూ కూడా ఏడుపదులు దాటింది. ఒకావిడ సన్నటి అంచున్న నేతచీర కట్టుకుంటే మరొకావిడ మంగళగిరి కాటన్ చూడీదార్ వేసుకున్నారు.

చీరలో ఉన్నావిడ పేరు ప్రభావతి, చూడీదార్ లో ఉన్నావిడ జయలక్ష్మి. వారిద్దరూ వియ్యపురాళ్ళు, అంతకంటే మించి గొప్ప స్నేహితురాళ్ళు. గేట్ తాళం వేసి వెనక్కి తిరిగి కుడివైపున తయారుగా ఉన్న రెండస్థుల భవనాన్ని తనివితీరా చూసుకున్నారు. అంతా పెయింట్ వాసన, కొత్తగా మనసుకి హత్తుకునేలా ఉంది. "విశ్రాంతి " అన్న నియాన్ అక్షరాల బోర్డ్ భవనం పక్కన నిలబెట్టి ఉంది, దానిని రేపే పైన తగిలించాలి.

"విశ్రాంతి, ఇది మన స్వంత ఇల్లు " అని రాసి ఉన్న బోర్డ్ అది.

ఒక అంతస్థుకి పది గదులచొప్పున ఇరవై గదులు ఉన్నాయి ఆ బిల్డింగ్ లో.

"జనవరి ఒకటికి సరిగ్గా ఒక నెల ఉంది కదూ, అప్పటికి ఇది పూర్తిగా తయారైపోదూ? " అంది జయలక్ష్మి.

"అవును జయా, అన్నీ సరిగ్గా మనం అనుకున్నట్టే జరుగుతే " అంది ప్రభావతి.

" తప్పకుండా జరుగుతుంది, నీ సంకల్పం ఎప్పుడూ తప్పలేదు కదూ, ఇదీ అలాగే అందావిడ" అనునయంగా.

"హూ "అని నిట్టూర్చి, ఇంట్లోకి కదిలింది ప్రభావతి. ఆవిడ వెనకే జయలక్ష్మి, ఈ మధ్యన కొద్దిగా మోకాలు నొప్పి రావడంతో ఆవిడ కాస్త నెమ్మదిగా నడుస్తుంది,

ఇంట్లోకి వచ్చి ఇద్దరూ చెరొక అరటి పండు తిని, మజ్జిగ తాగారు. ఎవరి మంచమ్మీద వారు కూర్చుని ఎదురుగా గోడ మీద ఉన్న "విశ్రాంతి ఆశ్రమం" అని రాసి ఉన్న ఫోటో వంకే చూశారు. ఫోటోలో ఆర్టిస్ట్ వేసిన చిత్రానికి చాలా దగ్గరగా ఉంది తయారైన ఆ భవనం. ఇద్దరూ ఒకరినొకరు చూసుకుని తృప్తిగా నవ్వుకున్నారు. తర్వాత చిరునవ్వుతో మంచం మీద వాలి రగ్గులు కప్పుకుని సంతృప్తిగా కళ్ళు మూసుకున్నారు. కాసేపట్లోనే జయలక్ష్మి నిద్రలోకి జారుకుంది, మంద్రంగా కదులుతున్న ఆవిడ ఉఛ్ఛ్వాశ నిశ్వాసలు మాత్రం వినిపిస్తున్నాయి ఆ గదిలో.

ప్రభావతికి తొందరగా నిద్ర రాలేదు. కళ్ళుమూసుకుంది కానీ, మనసుని మూయలేని ఆలోచనలు చిక్కుపడిన దారపు ఉండలా మనసులో కదులుతున్నాయి.

గడచిన జీవితం, నడుస్తున్న వర్తమానం, తన కలల్ని సాకారం చేస్తూ కదలాడుతున్న భవిష్యత్తూ ఆమెని - ఆలోచనల్లోకి నెట్టేస్తూ, ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి.

' ఒకటా, రెండా ? దాదాపు పదేళ్ళుగా తపిస్తున్నారు, తనూ జయా ఈ కల నెరవేర్చుకోవడం కోసం. తనకెంత తోడుగా నిలిచింది జయ, ఇన్నేళ్ళ ప్రయాణంలో. అమ్మానాన్నలెంత అండగా ఉన్నారో అంతగా, ఊహూ, అంతకంటే ఎక్కువగా. ఇరవై రెండేళ్ళ వయసూ, ఇంటర్ లో ఆగిపోయిన చదువూ, భర్త హఠాత్తుగా పోయినప్పుడు ధైర్యాన్నివలేకపోయాయి. దానికి తోడు ఇద్దరు చిన్న పిల్లలు. ఎటు చూసినా ఆయోమయం తప్ప అనునయం కనిపించని పరిస్థితి. అప్పుడే, అన్నీ తానే అయి నిలిచింది జయ.

పదిహేడేళ్ళకే, యూనివర్సిటీలో పి.హెచ్.డీ చేస్తున్న రామ్మోహన్‌తో పెళ్ళి, ఐదేళ్ళలోఇద్దరు పిల్లలు. సంతోషంగా సాగిపోతున్న జీవితం, బెంగుళూరు యూనివర్సిటీలో లెక్చరర్ గా రామ్మోహన్‌కి ఉద్యోగం రావడంతో మరింత

ఆనందదాయకం అయింది. పొద్దున్నే నిద్రలేచి భర్తనీ, పెద్ద పిల్లనీ పంపి, ఇంటి పని ముగించుకుని ఇష్టమైన పుస్తకాలు చదువుకుంటూ, రేడియోలో పాటలూ, వివిధ భారతి, సిలోన్ స్టేషన్‌లలో వచ్చే కార్యక్రమాలు వింటూ కులాసాగా గడుస్తున్న కాలం రామ్మోహన్  ఆకస్మిక మరణంతో తల్లక్రిందులైపోయింది. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో పుట్టి పెరిగిన ప్రభావతి మొదటినించీ చదువులో చురుకుగా ఉండేది. పదోక్లాస్ పూర్తి కాగానే  ఆ తరంలో చాలా మంది అమ్మాయిల లాగానే పద్ధెనిమిదేళ్ళకి రామ్మోహన్ తో పెళ్ళి జరిగి మొదట విశాఖపట్నం వచ్చింది. అతనికి ఉద్యోగం రావడంతో భర్తా, కూతురూ, తనూ, బెంగుళూరు వచ్చారు. చిన్న కూతురు బెంగుళూరు లోనే పుట్టింది.

కాంపస్‌లోనే ఇచ్చిన ఇల్లు, దాని చుట్టూ అల్లుకుని ఉన్న తోటా, బెంగుళూరు నగరపు సహజ వాతావరణమూ ప్రభకెంతో నచ్చాయి. ఆవిడకి చిన్నప్పటినించీ మొక్కలన్నా, తోటలన్నా ఎంతో ఇష్టం. పువ్వులంటే మరీ, పిల్లల్లాగే నవ్వులు పంచుతాయని ఆమె అభిప్రాయం.  ఇంట్లో కూడా చాలా శ్రద్ధగా మొక్కలు పెంచేది, దానికి తోడు ఆమె చేతిన ఏం మొక్క పెట్టినా అది ఎంతో ఏపుగా పెరిగి పూలూ, కాయలూ ఇచ్చేవి. దాంతో అందరూ ఆ మెవి 'గ్రీన్ ఫింగర్స్' అనేవారు. క్వార్టర్స్ వెనక ఉన్న స్థలంలో పూల మొక్కలూ, కాయగూరల మొక్కలూ పెంచేది. రుచికరమైన ఆ ంధ్రావంటలు చేసి తోటి లెక్చరర్ల ఇళ్ళకి పంపేది, రకరకాల భాషలవారితో మిని ఇండియాలా ఉండే  కేంపస్‌లో తనకి వీలైనంతగా ఇమిడిపోవాలని ప్రయత్నించేది.  హాయిగా సాగుతున్నకాలం భర్త  ఆకస్మిక నిష్క్రమణంతో స్థంభించినట్టయింది ప్రభకి.

పాలకొల్లు వెళ్ళిపోదామని ఎంతగానో చెప్పారు తల్లీ తండ్రి, కానీ ప్రభకి అస్సలు వెనక్కి వెళ్ళాలని అనిపించలేదు. ఎందుకో ఇదే తనుండవలసిన చోటని ఆమె మనసుకెంతో గట్టిగా అనిపించింది, అదే మాట అమ్మా నాన్నలతో చెప్పింది. ఎన్నోవిధాల చెప్పిన వారు ఆమె పట్టుముందు ఎదురు నిలవలేకపోయారు. ఊరిలో ఉన్న పొలాలు కౌలుకిచ్చి తామిద్దరూ ఆమె దగ్గరే ఉండాలని నిర్ణయించుకున్నారు. ప్రభ నిర్ణయం వెనక ఉన్న ముఖ్యమైన కారణం ఆమె స్నేహితురాలు జయ. ప్రభ ఇంటికి నాలుగో ఇల్లు జయలక్ష్మిది. ఆమె భర్త శ్రీనివాసన్ ఆర్థిక శాస్త్రవిభాగంలో ప్రొఫెసర్. ఆవిడ యూనివర్సిటీలోనే ఎడ్మినిస్ట్రేషన్ విభాగంలో యూ.డీ.సీ గా పనిచేస్తుంది. చాలా సరదా అయిన మనిషి. తమిళనాడుకి చెందిన వాళ్ళు ఎప్పటినించో బెంగుళూరులో స్థిరపడ్డారు. తీరని దు:ఖంలో ఉన్న ప్రభని అందరికంటే ఎక్కువగా ఓదార్చింది. ఊరికే ఓదార్పు మాటలు చెప్పి ఊరుకోలేదు

" ప్రభా, మన జీవితాల్లో జరిగే విషయాల మీద మనకుండే కంట్రోల్ చాలా స్వల్పం. అది నిజం కాకపోతే అన్నీ మనకిష్టమైనవే జరిగేలా చూసుకోమా? కష్టంలోనే మన స్థితప్రజ్ఞత తెలిసేది, కాదంటావా? జరిగిన సంఘటన చిన్నది కాదు, నిజమే, పిల్లలని చూడు, నువ్వు ఇంత బేలగా ఉంటే వాళ్ళ సంగతి ఏమిటి చెప్పు? ఇక్కడ మేమందరమూ లేమా నీకండగా? ముందు నువ్వు నీ కాళ్ళమీద నిలబడి పిల్లలకి  అండగా ఉండాలి, వాళ్ళ భవిష్యత్తు  ముఖ్యం మనందరికీ, అది మీ పల్లెటూరికన్నా ఇక్కడ ఉంటే బావుంటుంది కదా, శ్రీనివాసన్ అధికారులతో మాట్లాడుతున్నారు నీకుద్యోగం వచ్చే విషయంలో. జాగ్రత్తగా ఆ లోచించుకుని నిర్ణయించుకోవాలి. ముందు నువ్వు అన్నం తిను, " అని ఎన్నో రకాల ధైర్యం చెప్పింది.

ప్రభకి స్నేహితురాలిగా, కావలిసిన వ్యక్తిగా ఆమె వెన్నంటి ఉండాలని ఆమె సంకల్పం. ' మనకి కావలసినవారు ఆపదలో ఉన్నప్పుదు ధైర్యం చెప్పడం ఒక పద్ధతి. వారి అవసరం కనుక్కుని సహాయం చెయ్యడం మరొక పద్ధతి. ' ' ప్రార్థించే పెదవులకన్న సాయం చేసే చేతులు మిన్న 'అని ప్రగాఢంగా నమ్మిన వ్యక్తి జయలక్ష్మి.

సానుభూతి పూర్వకమైన చర్యగా రామ్మోహన్ ఉద్యోగం ఆయన కుటుంబ సభ్యులలోఎవరికైనా ఇచ్చే అవకాశాన్ని గురించి విచారించినప్పుడు, ప్రభావతి కున్న విద్యార్హతలు టీచింగ్ జాబ్‌కి సరిపోవు అని తెలిసింది..

'అసలు ఉద్యోగం చెయ్యాలి, అది తనవల్లవుతుందా ? ' అనే ఆలోచనకే భయపడుతున్న ప్రభ ఈ విషయం తెలిసిన తర్వాత మరింత అధైర్యపడింది.

"నువ్వన్నావని నేనూ అనుకున్నాను కానీ, ఈ ఉద్యోగాలూ అవి నావల్లనేమవుతాయి ?అని నేననుకున్నట్టే జరిగింది చూడు. చదువులేకపోతే ఇంతే, నా పిల్లల్ని నేను ఎలా చూసుకోగలను? " అని బాధపడింది.

అప్పుడు జయ పక్కనుండి ధైర్యం చెప్పడమే కాక, భర్త సహకారంతో యూనివర్సిటీ అధికారులతో మాట్లాడి ముందు అమ్మాయిల హాస్టల్‌లో వార్డెన్‌కి సహాయకురాలిగా ఒక అవకాశం వచ్చేలా చూశారు. చిన్న ఉద్యోగం, జీతం కూడా సుమారుగా వచ్చేది, ఆమె ఉద్యోగానికి పెద్దదైనా, అదే క్వార్టర్ లో ఉండేందుకు అనుమతి ఇచ్చారు అధికారులు. అలా మొదలయింది ఆమె కొత్త ప్రస్థానం. జయలక్ష్మి ప్రోద్బలంతో, ప్రోత్సాహంతో ఓపెన్ యూనివర్సిటీలో బి.ఏ లో చేరి పాసయింది, జయ ఎం.ఏ చదివింది ప్రభకి తోడుగా. తెలియనివన్నీ దగ్గరుండి చెప్పేది. డిగ్రీ పాసయ్యాకా, డిపార్ట్‌మెంటల్ పరీక్ష పాసయి యూ.డీ.సీ గా రిటైర్ అయ్యింది.

'తోడుగా జయే లేకపోతే ఈ పాటికి అమ్మా నాన్నలతో పాటు పాలకొల్లు వెళ్ళిపోయి అక్కడే..' ఇంక ఆలోచించలేకపోయింది. ఈ మహానగరమూ, మనసుని తెలుసుకున్న మంచి ఫ్రెండూ ఇచ్చిన ధైర్యం ఇది. ఆరాధనగా, అభిమానంగా పక్కమంచమ్మీద నిద్రపోతున్న జయలక్ష్మి వైపు చూసింది. తన పెద్ద కూతురు మధురిమని తన కొడుకు రాఘవన్‌కి చేసుకుంటాను అన్నప్పుడు ఉబ్బి తబ్బిబ్బయింది. అలా స్నేహంతో మొదలైన వారి బంధం బంధుత్వమైంది.

' సొంత అక్కచెల్లెళ్ళైనా ఇంత సహాయం చేస్తారా? ఇంత అండగా ఉంటారా?' అనుకుంది. తర్వాత ఆమె చూపు ఇద్దరి మంచాల మధ్యనున్న బెడ్ సైడ్ టేబిల్ మీద ఉన్న అమ్మా నాన్నల ఫోటో వైపు మళ్ళింది.

' అమ్మా నాన్నల సహాయం లేకపోతే తనూ, తన పిల్లలూ ఎలా ఉండేవాళ్ళమో ?' అనుకుంటేనే ఆమె మనసంతా వారి పట్ల కృతజ్ఞతతో నిండిపోతుంది. ఒకరకంగా తమ ఈ ప్రోజెక్ట్ వెనక ఉన్నది వాళ్ళిద్దరే. మొదటినించీ భూమినే నమ్ముకున్న రైతు, నాన్న. శ్రీనివాసన్ సహాయంతో బెంగుళూరు నగర శివార్లలో ఒక పెద్ద స్థలం కొన్నారు. ఆయనా, శ్రీనివాసన్ ఇద్దరూ బ్రతికున్నప్పుడు ఆ పెద్ద స్థలంలో పళ్ళచెట్లూ, పూల మొక్కలూ పెంచేవారు, అక్కడ పండేవాటిని తండ్రి దగ్గరలో ఉన్న మార్కెట్ కి పంపి అమ్మేవారు. నాన్న చేతితో ఏ మొక్క పెట్టినా అది నవనవలాడుతూ పెరిగేది, తనకీ నాన్న పోలికేనేమో, అలా అనుకుంటేనే డెబ్బైమూడేళ్ళ ఆ కూతురి పెదవులమీద గర్వంతో కూడిన చిరునవ్వు, నవ్వులు రువ్వే పువ్వమ్మల్లా, అలా మొదలయిందేవాళ్ళ నర్సరీ ' సింపిల్ స్మైల్స్ '.

చిరునవ్వుతో ఫోటోలోని వారిద్దరినీ చూసి రీడింగ్ లాంప్ ఆపి రగ్గు కప్పుకుని నిద్రకుపక్రమించింది. డిశంబర్ చలి కొద్దిగా వణికిస్తోంది. బయట మెల్లగా వీస్తున్న గాలి కిటికీమీద రాగాలు పలికిస్తోంది. దేవుని మందిరంలో వెలుగుతున్న దీపం పవిత్రంగా ఉంది, ప్రభావతి ప్రశాంతంగా నిద్రపోయింది.

రాఘవన్, మధురిమలిద్దరూ డాక్టర్లయి అమెరికాలో స్థిరపడ్డారు. చిన్న కూతురు అరుణిమ భర్తతో కలిసి ఢిల్లీలో ఉంటుంది. కాలక్రమంలో ఒకరితర్వాత ఒకరుగా తల్లీ, శ్రీనివాసన్, తండ్రీ కాలం చేయగా స్నేహితురాళ్ళిద్దరూ మిగిలారు ఒకరికొకరు తోడుగా.

ప్రభ రిటైర్ అయ్యాకా ఇద్దరూ తమ తోటలో చిన్న ఇల్లు కట్టుకుని అందులోకి  మారిపోయారు. నర్సరీ చూసుకునేవారు ఇద్దరూ కలిసి

"సొంతకూతురు కాకపోయినా జయా, కొడుకుకన్నా ఎక్కువగా నువ్వూ మమ్మల్నింత జాగ్రత్తగా చూసుకున్నారు, కానీ ఈ రోజుల్లో ఎంతమంది ముసలాళ్ళకింత అదృష్టం దక్కుతుందమ్మా? నేనూ, నా కుటుంబం అన్న చిన్న పరిధి గీసేసుకుని, ఆ  మోహంలో స్వార్ధపరులైపోతున్న ఈ కాలపు పిల్లలని చూస్తుంటే ముందు తరాలు ఎలా ఉంటాయా అని భయమేస్తోందమ్మా, ఏమిటో ? " అని ఎప్పుడూ తండ్రి అనే మాటలు ప్రభ మనసులో ఎన్నో ఆ లోచనలకి తెర తీసాయి. పరికిణీ పైకెగకట్టి తోటి పిల్లలతో తొక్కుడు బిళ్ళలాడుకున్న అప్పటి ప్రభకీ, జీవితాన్ని ధైర్యంతో ఎదురీదిన ఈ నాటి ప్రభ కీ మధ్య వచ్చిన పరిణతి ప్రభావం అది.

ఆమె ఆ నాటి ఆలోచనలకి  ఆ  స్నేహితులిద్దరూ కలిసి ఇచ్చిన సాకారమైన  ఆకారమే "  విశ్రాంతి, ఇది మన ఇల్లు. "

గడియారం మూడు కొట్టింది. మంచినీళ్ళు తాగడానికి నిద్ర లేచిన జయలక్ష్మి నీళ్ళు తాగి స్నేహితురాలివైపు చూసింది. ప్రశాంతంగా ఉన్న ప్రభ ముఖం, ఎంతో అందంగా కనిపించింది. వెండి తీగల్లా మెరుస్తూ ఆవిడ నుదిటిన అల్లిబిల్లి గా  ఆడుతున్నాయి ఆమె నుదిటిన ముంగురులు.

"ఎంత బేలగా ఉండేది? ఎలా ధీరగా మారింది? తమ లక్ష్యాన్ని ఎవరిదగ్గరినించీ ఒక్క పైసా ఆశించకుండా కేవలం తమ కష్టంతోనే సాధించేంత సుధీరగా తాను నిలవడమే కాక, ఒకప్పుడు తను వెన్ను తట్టిన నెచ్చెలి తనకి ఆలంబనగా ఎలా నిలిచింది,  అనుకుంటే ఎంతో ఆశ్చర్యంగా ఉంటుంది తనకు. ఇద్దరిదీ ఒక భాష కాదు, ఒక ప్రాంతం కాదు, కలిసిన ఆ-లోచనలూ, కలబోసుకున్న అనుభూతులూ, కదిలి వేసిన అడుగులూ, కలిసి పంచుకున్న ఈ ఇంటి కప్పూ, ఇవి మాత్రమే కాదు, తమ ఇద్దరినీ కలిపినవి. కనిపించని బంధం, కలనైనా వీడని అనుబంధం." ఆవిడ స్మృతులు దాదాపు పదేళ్ళు వెనక్కి మళ్ళాయి.

ప్రభ రిటైర్ అయ్యేరోజుకి తామిద్దరూ ప్రభ ఉండే క్వార్టర్‌లోనే ఉండేవారు. ఆఫీస్‌లో వీడ్కోలు సమావేశం అయ్యాకా, రాత్రి పిల్లలు తామిద్దరినీ హోటల్‌కి తీసుకెళ్ళారు. ఇద్దరూ రిటైర్ అయ్యారు కనక తమ దగ్గరకి వచ్చేస్తే బావుంటుందని పిల్లలన్నప్పుడు ప్రభ ఒప్పుకోలేదు. "మేమేమీ ముసలాళ్ళం కాదు" అంది సరదాగా. "అది కాదు అమ్మా, మేమంటున్నది" అని రాఘవన్ అనునయంగా తమ ఉద్దేశ్యం చెప్పాడు. రాఘవన్ ప్రభని కూడా "అమ్మా "అనే పిలుస్తాడు, తనే `అత్తయ్యా` అన్న తెలుగు పిలుపుకి సరదా పడి మధుని అలా పిలవమంటుంది.

"రాఘవా, మా నాన్నగారెప్పుడూ తమ తరం గురించి ఎప్పుడూ బాధపడేవారు. అందుకని  ఆ  దిశలో ఏదైనా చెయ్యాలని నా సంకల్పం. జయతో ఈమధ్యనే అన్నాను ఈ మాట. తను కూడా ఆనందంగా ఒప్పుకుంది. పెద్దవారికోసం ఒక ఆశ్రమం పెట్టాలని మా ఆలోచన, మన కున్న తోట ఇంట్లోకి వెళ్ళి మా రిటైర్మెంట్ డబ్బూ, నర్సరీ మీద వచ్చే ఆదాయంతో మొదలు పెట్టాలని మా ఆలోచన" అంది స్థిరంగా.

"చాలా మంచి ఆలోచన, అంది అరుణిమ. కానీ మీరిద్దరూ.. "అర్థోక్తిలో గిపోయింది.

" అరూ చెప్పింది నిజమే! ఆలోచన మంచిదే కానీ  ఇది కేవలం మీ ఇద్దరి వల్లా జరిగేది కాదని నాకు కూడా అనిపిస్తోంది.  ఇలాంటి సేవలందిస్తున్న ఏదైనా మంచి సంస్థకి మనం విరాళమివ్వచ్చు కదా  " అన్నాడు ఆమె భర్త.

" కానీ మేము అనుకున్నది అది కాదు బాబూ, మన ఆధ్వర్యంలో, పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరగాలని మా కోరిక. దీన్ని మేం సేవగా అనుకోవడం లేదు, మా బాధ్యతగా అనుకున్నాం, అందుకే ఈ ఆలోచన " అంది జయలక్ష్మి.

తన మనసులోని మాటని ముందే తెలుసుకున్నట్టుగా అక్షరం పొల్లు పోకుండా చెప్పిన వియ్యపు(స్నేహితు)రాలి చెయ్యి మృదువుగా నొక్కింది ప్రభ. ఇద్దరి ముఖాల్లోనూ ఒకే రకమైన కాన్ఫిడెన్స్, స్థిరత్వం చూసి పిల్లలేమీ మాట్లాడలేకపోయారు. అలా మొదలైంది మరొక ప్రస్థానం.

ఇద్దరు స్నేహితురాళ్ళూ తర్వాత చాలా లెక్కలేసుకున్నారు, తమ జీవనానికీ, మందులకీ, ఇతర అవసరాలకీ సరిపడేలా నెలకింతని వేసుకుని మిగిలిన దానినీ, నర్సరీ మొక్కలమ్మగావచ్చే ఆదాయాన్నీ ఆశ్రమం కోసం వినియోగించాలని నిర్ణయించుకున్నారు. కానీ అది సరిపోదని తెలుసుకోవడానికి ఎక్కువ కాలం పట్టలేదు.

అప్పుడు చూశారు వాళ్ళు. 2003 వ సంవత్సరంలో అప్పుడప్పుడే చిన్న పిల్లలలోనూ, యువతలోనూ 'అతి ఇష్టమైన పదార్థంగా అవతరిస్తున్న ఇటలీ దేశపు ఆహార పదార్థం పిజ్జాలు. ఇతరదేశాల రెస్టారెంటులూ, ఫాస్ట్‌ఫుడ్ చెయిన్లూ అప్పుడప్పుడే దేశమంతటా విస్తరిస్తున్న రోజుల్లో, వాటి తాకిడిని తట్టుకుంటూ మనదైన ఒక బ్రాండ్ పరిచయం చెయ్యాలన్న ఉద్దేశ్యంతో 'అమూల్' తమ శైలిలో, తక్కువ ఖరీదులో పిజ్జాలని అందించడానికి అనుబంధ సంస్థలుగా (ఫ్రాంచైజీలు) పనిచెయ్యడానికి సంస్థలూ/ వ్యక్తులూ కావాలని, ఆసక్తి కలవారిని సంప్రదించమని కోరుతూ ఇచ్చిన ప్రకటనని.

ఐదువేల రూపాయలతో 'అమూల్' వారి సహాయంతో మొదలుపెట్టారు పిజ్జాల వ్యాపారం. నల్లేరు మీద నడక కాదు ఏ పనైనా సాధించడం. మొదట్లో చుట్టుపక్కలున్న స్కూళ్ళల్లోనూ, చుట్టుపక్కల ప్రాంతాలలోనూ తెలిసింది, పిజ్జా తయారీకి కావలసిన సాస్‌లు , అవీ ఇంట్లో తయారు చేసి అమ్మడం వల్లవారి పిజ్జాలు తక్కువ ధరకి దొరకడం వల్ల అవి బాగానే పేరు పొందాయి. కానీ వారి ఖర్చులూ అవీ పోనూ పెద్దగా ఏమీ మిగిలేది కాదు. అది స్నేహితురాళ్ళిద్దరినీ బాగా నిరాశ పర్చింది. కానీ పట్టు పట్టడమే కానీ విడవడం తెలియని వారు వాళ్ళిద్దరూ. " ఏం చేసి ఆదాయం పెంచడమా? " అన్న విషయం మీద చాలా ఆలోచించారు, చాలామందిని సంప్రదించారు, సలహాలడిగారు.

దానిలో భాగంగా నగర శివార్లలో అప్పుడప్పుడే వెలుస్తున్న ఐ.టీ పార్కులకి వెళ్ళి కార్పోరేట్ సంస్థలతో మాట్లాడారు. వారు అనుమతిస్తే వారి కాంటీన్‌లలో తమ కౌంటర్లని పెట్టుకుంటామని. అలా ఐ.బీ.ఎం, హెచ్. పీ, ఆక్సెంచెర్ వంటి సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుని అక్కడ అమ్మకాలు మొదలు పెట్టారు. అప్పటినించీ "గ్రానీస్ పిజ్జాస్' పేరిట ఆ ఇద్దరు అమ్మమ్మలూ అమ్మే చిరుతిళ్ళకి ఎదురు లేకుండా పోయింది. దాదాపు మూడు, నాలుగు వందల పిజ్జాలు అమ్ముతారు రోజుకి.

పదిమందిని పనిలో పెట్టుకున్నారు. వారు రెండు టీములుగా పని చేస్తారు. మొదటి టీములో ఆడవారు ఇంట్లో వాటిని తయారు చేసి ఇస్తే మగవారు ఇళ్ళకి డెలివరీ చేస్తారు. రెండో టీములో వారు ఆఫీస్‌లకి వెళ్ళి వారు చెప్పిన ప్రకారం తయారు చేసి తాజాగా అందిస్తారు. అలా వచ్చిన ఆదాయంతోనే వచ్చేనెల ప్రారంభం కాబోతున్న విశ్రాంతి ఆశ్రమాన్ని కట్టించారు. ఎప్పుడో లక్షరూపాయలు పెట్టి కొన్న స్థలంలో, పది లక్షల రూపాయల భవనం వారి సంకల్పానికీ, మనోబలానికీ నిలువెత్తు రూపంలా నిలిచింది ఈ నాడు. ఇప్పటివరకూఅప్పుడు ఇన్నాళ్ళుగా దగ్గరలోని అద్దె ఇంట్లో నడుస్తున్న ఆశ్రమం ఇక ఇక్కడకే మారిపోతుంది. అలా అనుకుంటేనే ఆ మె మనసంతా ఎంతో ఆనందంతోనూ, గర్వంతోనూ నిండిపోయింది. ఇది తమ కల, నెరవేరుతున్న కల. నిజమవుతున్న గొప్ప కల.

చక్కటి వంటిల్లూ, దానికి ఆనుకుని ఉన్న డైనింగ్ హాలూ, చుట్టూ నడకకోసం ఏర్పరిచిన కాలి బాటా, వారి ఆనందం కోసం, ఆహ్లాదం కోసమూ తాము లోచించిన ఏర్పాట్లూ ఆవిడకొకటొకటిగా గుర్తొస్తున్నాయి.

"ఈ ఇరవైగదులనీ, నలభై చెయ్యాలి, పెద్దవారితో పాటు బ్రతుకులో గమ్యం తెలియని, ఆర్థిక కారణాల వల్లో మరే ఇతర కారణాల వల్లో గమ్యం చేరుకోలేకపోతున్న యువతకి ట్రైనింగ్ కోర్స్ ల లాంటివి ఏర్పాటు చెయ్యాలనీ ఇలా ఇంకా ఎన్నో ఆలోచనలున్నాయి ప్రభకీ, తనకీ. దైవం అనుకూలించాలే కానీ ఈ గ్రానీలిద్దరూ అవన్నీ సాధిస్తారేమో ఎవరికి తెలుసు? వయసూ, ఈ చిన్న చిన్న నొప్పులూ తమకడ్డేమీ కాదు, " అనుకుందావిడ.

పాత తెలుగు పాటలనీ, పల్లెపదాలని వింటూ పెరిగిన ఒకప్పటి పల్లెటూరి పిల్ల ఈనాడిలా ఎంతోమందికి ఆదర్శంగా నిలిచింది అనుకుంటేనే తనకెంతో ఆశ్చర్యంగానూ, ఆనందంగానూ ఉంటుంది. ప్రభ చిన్నతనాన తరచూ పాడే పాట "నవ్వులు రువ్వే పువ్వమ్మా" గుర్తొచిందావిడకి. పువ్వులనీ, మొక్కలని అమితంగా ప్రేమించే ప్రభకెంతో ఇష్టమైన పాట అది. అందుకే ఆమె `నవ్వులు పంచే పువ్వమ్మ" అయిందేమో. ఆదమరిచి నిద్రపోతున్న స్నేహితురాలి చేతిని మెత్తగా తాకి తిరిగి నిద్రకి ఉపక్రమించిందావిడ.

●●●

Click here to share your comments on this story